ప్రజాశక్తి

సోమవారం 3 ఫిబ్రవరి 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

నేడు జిఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీకి సోమవారం జరిగే ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కమిషనర్ ఎన్నికల అధికారి, జిఎంసి అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఇతర అధికారులతో కలిసి ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించిన ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు. సూచిక బోర్డులు, పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కంపార్ట్‌మెంట్ బ్యాలెట్ బాక్స్, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సామగ్రిని పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశ ద్వారానికి, బయటకు వెళ్లే ద్వారాలకు ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, సోమవారం ఉదయం 10.30 గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 3 గంటలకు ముగుస్తుందని చెప్పారు. ఓటు వేయటానికి వచ్చే కార్పొరేటర్లకు మాత్రమే కార్యాలయంలోకి అనుమతి

▶ 2లో



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ పి.శ్రీనివాసులు



తాడేపల్లిలో నిరసన తెలుపుతున్న సిపిఎం శ్రేణులు

5 లో

దగా బడ్జెట్‌పై సిపిఎం శ్రేణుల ధ్వజం

కేంద్ర బడ్జెట్‌లో అన్యాయంపై గుంటూరు జిల్లా వ్యాప్తంగా నిరసనల హోరు

బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ 5న నిరసనలు

ప్రతుల దహనానికి రైతుసంఘం పిలుపు

- 8 లో

పసి కాయంపై పశు గాయం..

- కూతురికి అన్నానికి బదులు ఒళ్లంతా అట్లకాడ వాతలు
- చెత్తకుప్పల్లో అన్నం ఏరుకునే దుస్థితికి చిన్నారి
- ఇంటి ఓనర్‌తో కలిసి తల్లి అకృత్యాలు



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

అల్లారుముద్దుగా చూసుకోవడం అటుంచితే ముద్ద అన్నం పెట్టడానికి కూడా ఆ తల్లికి చేతులు రాలేదు. పసి దేహంపై పశువులా వాతలు పెట్టడం.. ఒక తల్లికి ఇది ఎలా సాధ్యం అనేంతగా ఆమె చర్యలు విస్మయానికి గురి చేశాయి. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని చిన్నారి కుమార్తెను అట్లకాడతో వాతలు పెట్టి హింసించడమే కాకుండా అన్నమూ పెట్టకుండా వీధిన పడేసిన ఘటన సత్తెనపల్లి పట్టణంలో కలకం రేపింది.

గుంటూరుకు చెందిన మాధవి భర్త నాలుగేళ్ల కిందట చనిపోయాడు. దీంతో తన ఆరేళ్ల కుమార్తెతో కలిసి సత్తెనపల్లిలోని ఓ అద్దె ఇంట్లో కొన్ని నెలలుగా మాధవి నివాసం ఉంటోంది. ఈ క్రమంలో మాధవి మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకోగా అందుకు ఇల్లు అద్దెకిచ్చిన మహిళా సహకరిస్తోంది. తన చర్యలకు కుమార్తె అడ్డుగా ఉందని భావించిన మధవితోపాటు ఇంటి ఓనర్ అయిన మహిళ సైతం బాలికను చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఐదు రోజులుగా అన్నం పెట్టలేదు. ఆకలేస్తోందని అడిగితే ఒళ్లంతా అట్లకాడతో వాతలు పెట్టారు. తీవ్రంగా కాలిన గాయాలతో అల్లాడిన చిన్నారి వేధిస్తున్న

▶ 2లో



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

కెఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం కృషి : యుటిఎఫ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 27న జరగనున్న నేపథ్యంలో పిడిఎఫ్ అభ్యర్థి అయిన కెఎస్ లక్ష్మణరావు విజయం కోసం ప్రజాసంఘాలతో కలిసి యుటిఎఫ్ శ్రేణులు కృషి చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టిఎస్ఎల్ఎన్.మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. నరసరావుపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ బడి కోసం బస్సు యాత్ర పేరుతో యుటిఎఫ్ చేసిన పోరాటం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కాపాడుకున్నామని, పోరుబాట ద్వారా రూ.3 వేల కోట్ల ఆర్థిక బకాయిలను విడుదల చేయించుకోగలిగామని, ఈ పోరాటాల్లో కెఎస్ లక్ష్మణరావుతోపాటు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రత్యక్షంగా పాల్గొన్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ఇచ్చిన హామీల విస్మరణపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జీవో 117 రద్దు తర్వాత మార్పుల గురించి, జాబ్ క్యాలెండర్, డీఎస్సీతోపాటు ప్రజలకు సంబంధించిన అన్ని సమస్యలనూ శాసన మండలిలో ప్రస్తావించి, ప్రభుత్వంపై ఒత్తిడి

▶ 2లో

నేడు జిఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని, లోపలకు వచ్చే సమయంలో జిఎంసి జారీ చేసిన గుర్తింపు కార్డు విధిగా కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఫోన్లు, ఎలక్ట్రికల్ సంబంధిత వస్తువులు, ఏ ఇతర సామగ్రిని పోలింగ్ కేంద్రంలోకి అనుమతించబోమన్నారు. కార్పొరేటర్ల ఇతర వస్తువులు భద్రపరచుకోవటానికి జిఎంసి పార్కింగ్‌లో పౌరసేవా కేంద్రం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్లోక్ రూమ్‌లో బద్రపరచుకోవాలని కోరారు. పోలింగ్ సందర్భంగా నగర పాలక సంస్థ కార్యాలయంలోకి ఇతర వాహనాలు పార్కింగ్ నిషేధించామని, ఓటింగ్ కోసం కార్యాలయానికి వచ్చే కార్పొరేటర్ల వాహనాలను గాంధీపార్క్ పార్కింగ్‌లో వాహనాలు నిలుపుకోవాలని తెలిపారు. జిఎంసి ఉద్యోగులు విధిగా గుర్తింపు కార్డుతో, వారికి కేటాయించిన విభాగాల్లోనే విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల అధికారి మినహా ఇతర ఎన్నికల సిబ్బంది ఫోన్లను పోలింగ్ కేంద్రంలోకి అనుమతించబోమన్నారు. ఎన్నికల నిర్వహణలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మూడంచెల భద్రతతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారి, డిప్యూటీ కమిషనర్-1 డి.శ్రీనివాసరావు, కౌన్సిల్ సెక్రెటరీ పి.శ్రీనివాసరావు, ఓటర్ల గుర్తింపు అధికారి, జిఎంసి మేనేజర్ షేక్ బాలాజీ బాషా, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పద్మనాభరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పసి కాయంపై పశు గాయం..

(మొదటి పేజీ తరువాయి)

గాయాలతోపాటు ఆకలితో కడుపు మాడుతుండడంతో రైల్వేస్టేషన్ రోడ్డులోని చెత్తకుప్పల వెంట పదార్థాలు ఏరుకుని ఆకలి తీర్చుకునే ప్రయత్నం చేసింది. ఇది గమనించిన స్థానికుడొకరు 1098కి ఫిర్యాదు చేయగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా కానిస్టేబుల్ చిన్నారి ఇంటికెళ్లారు. ఇది గమనించిన ఇంటి ఓనర్ తన పెంపుడు కుక్కను వారిపైకి ఉసిగొల్పింది. మాధవికి పెళ్లే కాలేదని, ఆమెకు కూతురు ఎక్కడిదని బుకాయించింది. దీంతో వారిద్దర్నీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా కుమార్తె ఉన్నట్లు అంగీకరించారు. చిన్నారిని అధికారులకు కనిపించకుండా దుస్తులు పెట్టే ర్యాక్‌లో దాచినట్లు చెప్పగా పోలీసులెళ్లి పాపను కాపాడి తీసుకొచ్చారు. బాలిక శరీరంపై ఉన్న వాతలు, దెబ్బలు చూసిన పోలీసులు, ఐసిడిఎస్ సిబ్బంది విస్మయానికి గురయ్యారు. వెంటనే బాలికను నరసరావుపేటలోని శిశు సంరక్షణ కేంద్రానికి తరలింకి కేసు నమోదు చేశారు.

కెఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం కృషి : యుటిఎఫ్

(మొదటి పేజీ తరువాయి)

తేవాలంటే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. జూన్ నుండి జనవరి వరకు ఇవ్వాల్సిన టిఎ బకాయిలను ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం ఈ 8 నెలల కాలంలో సామాజిక పింఛన్ల పెంపు మినహా మిగతా హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలోనే డీఎస్సీ విడుదల చేస్తామనే ప్రకటన ద్వారా మరోసారి మభ్యపెడుతున్నారని అన్నారు. యుటిఎఫ్ ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 73 పోలింగ్ కేంద్రాల పరిధిలో 56900 మంది ఓటర్లున్నారన్నారు. వీరందరూ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటేసేలా చూడాలన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు, పరిష్కార మార్గాల పట్ల స్పష్టమైన అవగాహనతో సుదీర్ఘ పోరాటం చేస్తున్న కెఎస్ లక్ష్మణరావును శాసన మండలికి మరోసారి పంపిద్దామని అన్నారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ ఖాసీంపీరా, కోశాధికారి రవిబాబు, రాష్ట్ర ఆడిటర్ కమిటీ సభ్యులు పి.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు.

గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై సాయి రాగ సంగీత కళాశాల 4వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మునిపల్లె రమణి తన శిష్యులతో అలపించిన అన్నమయ్య కీర్తనలు అలరించాయి.

సంస్కరణల ముసుగులో తరగతుల విలీనం ఆపాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ విద్యా రంగానికి ప్రమాదం పొంచి ఉందని, దీనిని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎ.ఎన్.కుసుమకుమారి అన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన విస్తృత కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంస్కరణల ముసుగులో తరగతుల తరలింపు తగదని అన్నారు. ప్రాథమిక పాఠశాలలో 5 తరగతులు ఉండాలని అన్నారు. ఏ విద్యా కమిషన్‌గానీ, విద్యావేత్తగానీ 3,4,5 తరగతులు విడదీయాలని చెప్పలేదని తెలిపారు. విద్యారంగం బలోపేతానికి పాటుపడే పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావును రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం కనీసం పిఆర్‌సి కమిటీని నియమించకపోవటం, ఐఆర్, డిఎ ప్రకటించక పోవటం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పిఎఫ్, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు.



మాట్లాడుతున్న కుసుమకుమారి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా గౌరవాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, వై.నాగమణి, కోశాధికారి దౌలా, కార్యదర్శులు ఆదినారాయణ, సాంబశివరావు, గోవిందయ్య, రంగారావు, ప్రసాదు, కేదార్‌నాథ్, శ్రీనివాసరావు, కోటిరెడ్డి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

అనధికార మాంసం విక్రేతలపై జిఎంసి దాడులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో రోడ్లపై అనధికారికంగా నాటుకోళ్ళు, చేపల విక్రయాలపై ప్రజారోగ్యం దృష్ట్యా కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు జిఎంసి ప్రజారోగ్య అధికారులు బృందాలుగా ఏర్పడి నగరంలోని చుట్టుగుంట, నల్లపాడు రోడ్డు, మిర్చియార్డ్, ఆర్.టి.ఒ ఆఫీసు, గుజ్జనగుండ్ల, అమరావతి రోడ్డు, పట్టాభిపురం ప్రాంతాలలో రోడ్లపై అనధికారికంగా చేపలు, నాటుకోళ్ళు, మేకలను వధించి విక్రయిస్తున్న వారిని గుర్తించి వారిపై దాడులు నిర్వహించి వాటిని తొలగించి, అపరాధరుసుము కింద రూ.12,500 విధించామని తెలిపారు. నగర పరిధిలో ఎక్కడైనా అనధికారికంగా నాటుకోళ్ళు, చేపలు, మాంసం విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు, భారీమొత్తంలో అపరాధ రుసుం, విధించటమే కాకుండా, వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. నగరంలో మాంసం విక్రయాలు జరిపే యజమానులు సంబంధిత డాకుమెంట్స్ అందజేసి డిఅండ్ఓ ట్రేడ్ లైసెన్స్ పొంది వ్యాపారం నిర్వహించుకోవాలన్నారు. లైసెన్స్ లేని వారి షాపులను సీజ్ చేయటం జరుగుతుందన్నారు. మాంసం విక్రయించే షాపుల యజమానులు షాపు చుట్టు ప్రక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మాంసంపై దుమ్ము, ధూళి పడకుండా మెష్‌లు కట్టి ఎప్పటికప్పుడు శుభ్రత పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, వెటర్నరి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్.ఎస్.ఆనందకుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్లు సి.హెచ్.శ్రీనివాస్, నాగేశ్వరరావు, రాము, దాస్ పాల్గొన్నారు.


విక్రేతలతో మాట్లాడుతున్న అధికారులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కె.వి.బ్రహ్మం తదితరులు

పిల్లల్లోని నైపుణ్యాలను తల్లితండ్రులు గుర్తించాలి

ప్రజాశక్తి-గుంటూరు

చిన్న వయస్సులోనే పిల్లలు ఎటువంటి పనుల్లో మక్కువ చూపిస్తున్నారో, ఏ రంగాలలో ఆసక్తి కనపరుస్తున్నారో తల్లితండ్రులు తప్పనిసరిగా గుర్తించి, వారికి ఇష్టమైన రంగంలో ప్రోత్సహిస్తే గొప్ప స్థాయికి చేరుకుంటారని టిజెపియస్ కళాశాల సెక్రెటరీ, కరస్పాండంట్ కె.వి.బ్రహ్మం అన్నారు. జనవరి 28, 29 తేదీల్లో ఎన్‌టిఆర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి పాఠశాలల సాహితీ అకాడమీ స్పోర్ట్స్ మీట్‌కు సంబంధించి బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం టిజెపిఎస్ కళాశాలలో నిర్వహించారు. సాహితీ అకాడమీ సెక్రటరీ ఆర్.శివాజీ మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్ గత 20 సంవత్సరాల నుండి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని, విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలు గుర్తించి వారికి ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ వడ్లమూడి చాణక్య హైస్కూల్, రన్నర్స్‌గా నర్సరావుపేట సింధూ హైస్కూల్, గేమ్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్, వినుకొండ గుడ్‌షఫర్డ్, రన్నర్స్‌గా వడ్లమూడి చాణక్య హైస్కూల్, అథ్లెటిక్స్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్, రన్నర్స్‌గా నర్సరావుపేట సింధూ హైస్కూల్ సాధించాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్నాప్‌జిమ్ డైరెక్టర్ గోపాల్‌కష్ణారెడ్డి, మున్నంగి పాఠశాల సెక్రటరీ, కరస్పాండంట్ లక్ష్మినారాయణ రెడ్డి, చాణక్య విద్యాసంస్థ డైరెక్టర్ డి.కిషోర్, సాహితీ అకాడమీ అధ్యక్షులు ఈదర శివనాగమణి పాల్గొన్నారు.


బహుమతులిస్తున్న న్యాయమూర్తి పార్థసారధి తదితరులు

ముగిసిన మూట్ కోర్టు పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జాగర్లమూడి చంద్రమౌళి న్యాయకళాశాలలో గత రెండ్రోజుల నుంచి జరుగుతున్న నాల్గవ జాతీయస్థాయి మూట్ కోర్టు పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంటూరు జిల్లా సెషన్స్ జడ్జి పార్థసారథి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని తిరువనంతపురం ప్రభుత్వ లా కళాశాల కైవసం చేసుకోగా, రెండవ బహుమతి కె.ఎల్.యు దక్కించుకుంది.కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ పాలకమండలి అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ పి గోపీచంద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ సుధాకర్ బాబు, తదితరులు పాల్గొన్నారు

యోగా శాస్త్రబద్ధమైన జీవన విధానం

ప్రజాశక్తి-గుంటూరు

యోగా శాస్త్రబద్ధమైన జీవన విధానమని, ఆధునిక జీవనశైలిలో ఒత్తిడిని తట్టుకొని ఆహ్లాదకరమైన జీవితాన్ని గడిపేందుకు నిత్యజీవితంలో యోగా సాధనంగా మార్చుకోవాలని ప్రభుత్వ యోగా కోచ్ రామినేని రవి అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో వి.వి.రావ్ అధ్యక్షతన నిర్వహించిన ఆరోగ్య సభలో రవి మాట్లాడుతూ యోగా కేవలం వ్యాయామం, ఆరోగ్యానికి సంబంధించింది మాత్రమే కాదని, శక్తివంతమైన జీవన మార్గమని అన్నారు. మనసు లగ్నం చేసి క్రమం తప్పకుండా సాధన చేస్తే మనిషి శారీరకంగా, మానసికంగా యోగా ఉన్నత స్థితికి చేరుస్తుందన్నారు. శారీరక, మానసిక భావోద్వేగాల్లో సమతుల్యతను, స్థిరత్వాన్ని, దఢత్వాన్ని సాధించాలంటే యోగా ఒక జీవన విధానంగా మారాలన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా యోగాపై ఆసక్తి పెరుగుతుందని, యోగాసాధకులు, సంస్థల సంఖ్యా పెరుగుతుందన్నారు. ఈ క్రమంలో సాధారణ ప్రజలకు కూడా యోగాను చేరువ చేయటానికి నిరంతరం ప్రయత్నం జరగాలన్నారు. కార్యక్రమంలో విద్యావేత్త చంద్రయ్య, ఇంజినీర్ సదాశివం ప్రసంగించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడుకి గాయాలు

ప్రజాశక్తి- మాచర్ల :

మాచర్ల మండలం కంభంపాడు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడుకి తీవ్ర గాయాలయ్యాయి. దుర్గి మండలం ఓబులేశునిపల్లెకు చెందిన కొమ్ము అబ్రహం ఆటో వెనుక డోర్ పై కూర్చుని రెంటచింతలలో జరుగుతున్న కానుకమాత తిరునాళ్ళకు వెళుతున్నాడు. కంభంపాడు వద్దకు ఆటో చేరగానే ఆటో ఒక్క సారిగా బ్రేక్ వేయటంతో వెనుకగా వస్తున్న ద్విచక్ర వాహనం వెనుక భాగంలో కూర్చున్న అబ్రహాంను ఢీకొట్టింది. దాంతో అబ్రహం రెండు కాళ్ళకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు.


కాటాలను పరిశీలిస్తున్న కొలతలు, తూనికల అధికారులు

కొలతలు వ్యత్యాసం - 20 షాపులపై కేసులు

ప్రజాశక్తి - మంగళగిరి


పట్టణంలోని పలు దుకాణాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. తెనాలి నుంచి ప్రత్యేక బృందం ప్రత్యేకంగా చికెన్, మటన్, స్వీట్ షాపుల్లో తనిఖీలు చేశారు. 30 షాపుల్లో తనిఖీలు నిర్వహించగా 20 షాపుల్లో తూకాలు తేడాగా ఉన్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. తూనికలు, కొలతలు తెనాలి విభాగం ఇన్‌స్పెక్టర్ శేషసాయి, టెక్నికల్ సూపర్నెంట్ రవికిషోర్ పాల్గొన్నారు.

పల్లెలకు పాకుతోన్న సైబర్ మోసాలు

యాప్‌లో రూ. లక్షల్లో పెట్టుబడులు పెట్టి మోసపోయిన ప్రజలు

నేటి ప్రపంచంలో డబ్బు ప్రధాన పాత్ర పోషిస్తోంది. ప్రతి విషయంలో డబ్బు లేకుంటే ఏమీ చేయలేకపోతున్నాం. డబ్బు సంపాదించాలంటే ఏదో ఒక పని చేసుకోవాలి. అయితే అవసరాలకు సరిపడా డబుబ సంపాదించలేకపోవడంతో ఇతర మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు రోజుకో అవతారమెత్తుతూ ప్రజల అమాయకత్వాన్ని అసరా చేసుకుంటున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ సంపాదించ వచ్చనే భ్రమను అమాయకుల్లో కలుగజేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా కొత్త తరహా దోపిడీకి తెరలేపి అమాయక ప్రజలను దోచుకుంటున్నారు. ఇందుకు ఉదాహరణ పిడుగురాళ్ల పట్టణ, మండల ప్రజలే. వారు ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టి ఎలా మోసపోయారో తెలుసుకుందాం.





ప్రజాశక్తి–పిడుగురాళ్ల

నిన్న మొన్నటి వరకు పట్టణాలలో మాత్రమే కనిపించే సైబర్ నేరాలు నేడు పల్లెలకూ పాకాయి. రోజువారీ కూలీలు, చిరు వ్యాపారులే లక్ష్యంగా వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్ళు రెచ్చిపోతున్నారు. మా యాప్‌లో కొద్దిగా పెట్టుబడి పెట్టండి రోజుల వ్యవధిలోనే వేల రూపాయలు పొందండి అంటూ ఆశచూపి కొత్త తరహా దోపిడికి తెరలేపారు. యాప్‌లలో పెటుబడి పెట్టిన ఒకరిద్దరికి డబ్బు రావడంతో నిజంగా డబ్బులు వస్తాయనుకుని నమ్మి ప్రజలు వేల రూపాయిలు తెచ్చి ఆ యాప్‌లో పెట్టుబడులు పెట్టారు. తీర కొద్ది కాలానికి యాప్ నిర్వహణ ఆగిపోవడంతో తాము మోసపోయామని గ్రహించి లబోదిబోమంటున్నారు.

పిడుగురాళ్ళ పట్టణ, మండల పరిధిలోని గ్రామాలలో మూడు, నాలులు నెలలుగా కొత్త తరహా సైబర్ మోసం ప్రారంభమైంది. ఎల్‌ఓరియల్ గ్రూప్స్ పేరుతో సామాజిక మాధ్యమంలో ఓ యాప్ రూపొందించి అందులో కొన్ని ఎల్‌ఓరియల్ కాస్మొటిక్స్ వస్తువులు ఉంచి పక్కనే ఒక కోడ్‌తో వస్తువు ధర ఏర్పాటు చేస్తారు. దాని పక్కనే కొన్న వస్తువుకు ఎన్ని రోజులకు అమ్మకం జరుగుతుంది. అమ్మకం జరిగాక వినియోగదారుడుకి ఎంత మొత్తం వస్తుందని ఉంటుంది. ఉదాహరణకు రూ. 3,900లు పెట్టి ఒక వస్తువు ఆన్‌లైన్ ద్వారా పెట్టుబడి పెడితే ఆ వస్తువుపై రోజుకు 210రూపాయిలు చొప్పున 48రోజులకు 10,108 రూపాయిలు వస్తాయని తెలుపుతారు. ఇలా ఎంత ఎక్కువ పెట్టుబడి పెడితే అంత ఎక్కువ డబ్బు వస్తుందని తెలపడంతో ప్రజలు వేలాది రూపాయిలు పెట్టుబడులు పెట్టారు. వారు పెట్టడమే కాకుండా ఇతరులతో పెట్టిస్తే వారికి ఒక్కొక్కరికి 100రూపాయిలు ఆన్‌లైన్‌ద్వారా అందిస్తామని తెలపడంతో పెట్టుబడులు పెట్టిన ఇతరులచేతా పెట్టించారు. గుర్తు తెలియని వాట్సప్ నెంబర్ ద్వారా ఈ వ్యవహారమంతా నడిపించారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకొని పెట్టుబడులు పెట్టిన వారు వివరాలతో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి ఆయా వాట్సాప్ గ్రూప్‌లలో యాక్టివ్‌గా ఉండే వారికి గ్రూప్ బాధ్యతలు, నిర్వహణ అప్పగిస్తారు. ఎక్కువ మదిని ఈ యాప్‌లలో చేర్చేందుకు మీటింగ్‌లు సైతం నిర్వహించారని బాధితులు తెలుపుతున్నారు. రైతులు, ఆటో నడుపుకునే వారు, రోజువారీ కూలీలే ఎక్కువగా ఈ యాప్‌లో పెట్టుబడులు పెట్టినట్లు తెలుపుతున్నారు. మొదట్లో కొద్ది మందికి ఈ యప్ ద్వారా డబ్బులు వచ్చాయనీ, తర్వాత కొద్ది కాలానికి ఆ యాప్ నిర్వహణ ఆగిపోవడంతో పెట్టుబడుల వివరాలేవీ రావడంలేదని బాధిత ప్రజలు వాపోతున్నారు. కొందరు అత్యాశతో లక్షలాది రూపాయిలు ఈ యాప్‌లో పెట్టినట్లు బాధితులు తెలుపుతున్నారు. మోసపోయామని తెలిసి బయటకు చెబితే పరువు పోతుందనే భయంతో ఈ విషయంపై కొందరు పెదవి విప్పడం లేదు. పట్టణంలోని లెనిన్‌నగర్‌కు చెందిన సున్నం కార్మికులు ఈ యాప్ నందు ఎక్కువ మొత్తంలో పెట్టబడులు పెట్టారని రోజువారీ వడ్డీలకు తెచ్చి మరి పెట్టుబడులు పెట్టినట్లు బాధితులు తెలుపుతున్నారు. సుమారుగా రూ.4కోట్ల వరకు ఈ యాప్‌లో పెట్టుబడులు పెట్టినట్లు లెనిన్‌నగర్ గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం ఎన్ని రకాలుగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించినా ప్రజల అమాయకత్వాన్ని అసరా చేసుకుని సైబర్ నేరాగాళ్ళ జేబులు నింపుకుంటున్నారనడంలో సందేహం లేదు.



వల్లంశెట్టి నాగేశ్వరావు ఆధ్వర్యంలో పలువురికి సన్మానం

పదవులు పొందిన జనసేన నాయకులకు సన్మానం

ప్రజాశక్తి – మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గంలో జనసేన పార్టీలో పని చేస్తూ ఇటీవల కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు పొందిన పలువురిని సీనియర్ జనసేన పార్టీ నాయకులు వల్లంశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి వైష్ణవి కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. నియోజవర్గంలో నామినేటెడ్ పదవులు పొందిన ఏపీ ఎంఎస్ ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పి.మధుసూదన్‌రావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ బి.విజయశేఖర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి శ్రీనివాస్ యాదవ్ పాల్గొని ప్రసంగిస్తూ జనసేన పార్టీ ప్రజల కోసం పనిచేసే పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి, బి.నాగేశ్వరావు, సుంకరరామారావు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

ప్రజాశక్తి – నకరికల్లు



స్పెషల్ డ్రైవ్‌లో ఎస్ఐ చల్లా సురేష్

మద్యం తాగి వాహనాలు నడపరాదని ఎస్సై చల్లా. సురేష్ తెలిపారు. మండలంలో ఆదివారం స్పెషల్ డంకన్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వస్తుందన్నారు. మైనర్లు వాహనాలు నడపకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కన్నుల పండుగగా నిత్య సహాయమాత మహోత్సవాలు



ప్రార్థనలు చేస్తున్న గురువు కోయా స్లీవయ్య

ప్రజాశక్తి–తెనాలిరూరల్

నూతన సంవత్సరంలో నిత్య సహాయ మాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉంటాయని తెనాలి విచారణ గురువులు కోయ స్లీవయ్య అన్నారు. స్థానిక చెంచుపేట నిత్య సహాయ మాత మహొత్స వాలు దేవాలయంలో కన్నుల పండుగగా నిర్వహించారు. ఏటా తొమ్మిది రోజుల పాటు నిర్వహించే మహొత్సవాలు ఆదివారంతో ముగిసాయి. విద్యుత్ కాంతులతో దేవాలయ ప్రాంగణం శోబాయ మానంగా తీర్చిదిద్దారు. ప్రత్యేకంగా ఆదివారం ఉదయం, సాయంత్రం ప్రార్థనలు, సమిష్టి దివ్యబలి పూజ నిర్వహించారు. నిత్య సహాయమాత ఆశీర్వాదములు పొందిన భక్తులకు మేలు జరుగుతుందని భక్తుల విశ్వాసమని దేవాలయ సహాయ గురువులు విజయ్ కుమార్, అంతోని విన్సెంట్ తెలిపారు. సాయంత్రం జరిగే తిరునాళ్లకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధికంగా హాజరవుతారని కమిటి సభ్యులు తెలిపారు.



బహూకరించిన డప్పులతో మాదిగలు

25 డప్పులు బహూకరించిన కూచిపూడి రవి శేఖర్

ప్రజాశక్తి – చేబ్రోలు

లక్షల డబ్బులు వేల గొంతులు కార్యక్రమ నిర్వహణలో భాగంగా 25 డప్పులను కొత్తరెడ్డిపాలెంలో బహుకరించిన తెలుగుదేశం పార్టీ నాయకులు కూచిపూడి రవి శేఖర్ చలో హైదరాబాద్ సమాయత్త నియోజకవర్గ కార్యక్రమాన్ని కొత్త రెడ్డిపాలెంలో నిర్వహించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకష్ణ మాదిగ పిలుపుమేరకు ఫిబ్రవరి 7న హైదరాబాదులో జరగనున్న మాదిగల భారీ సంస్కతిక ప్రదర్శనలో మండలంలోని మాదిగలు భారీగా పాల్గొనాలని చేబ్రోలు ఎం ఆర్ పి ఎస్ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. సందర్భంగా కమిటీ సభ్యులు చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించి డప్పులను పంపిణీ చేశారు. గుంటూరు జిల్లా మహాజన సోషలిస్ట్ పార్టీ అధ్యక్షులు మురికి పూడి హదయరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమాయత్త కార్యక్రమంలో చేబ్రోలులోని 5 మాదిగ పల్లెల్లోని ఎమ్మార్పీఎస్ యువత డప్పుల ప్రదర్శన నిర్వహించారు. ఎంఎస్‌పి సీనియర్ నాయకులు కూచిపూడి సత్యం మాదిగ, ఎం ఈ ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి రవికుమార్, గురువు పాలెం, పెదకాకాని, నిదుబ్రోలు, కొత్తరెడ్డిపాలెం, చెన్నారెడ్డికాలని పాఠరెడ్డిపాలెం, చెర్లోపాలెం, చీలిపాలెం, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

ప్రజాశక్తి – దుగ్గిరాల



మృతి చెందిన శ్రీనివాసరెడ్డి

మండలంలోని వీర్ల పాలెం గ్రామానికి చెందిన ఈమని శ్రీనివాసరెడ్డి (49) పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. శ్రీనివాసరెడ్డికి సొంత కారు ఉంది. ఆయనే కారును నడపు తుంటారు. శుక్రవారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. శనివారం ఉదయం మంగళగిరిలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మరణిం చారు. ఆదివారం పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్టేషన్ రైటర్ ఎస్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి

ప్రజాశక్తి – సత్తెనపల్లి రూరల్



మృతి చెందిన రాఘవయ్య (ఫైల్)

ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో రైతు దుర్మరణం చెందాడు.. ఈ ఘటన సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఇనకొల్లు వీర రాఘవయ్య (58) ఆదివారం ట్రాక్టర్‌తో తన పొలాన్ని దున్ని ఇంటికి వస్తుం డగా మార్గమధ్యలో ట్రాక్టర్ దుపుతప్పి బోదె కాల్వలో పడి తిరగబడింది. సంఘటనలో రాఘవయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, శివమ్మ పిల్లలు ఉన్నారు. రాఘవయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు చోటు కున్నాయి. కుటుంబ పెద్ద మరణించడంతో భార్య పిల్లలు కన్నీరుగా మున్నీరుగా వినిపిస్తున్నారు.

ఐక్యతతో రాజ్యాధికారం : మంత్రి సవిత

ప్రజాశక్తి – మంగళగిరి



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత, బిసి నాయకులు

బీసీలు ఐక్యతతో రాజకీయాభివృద్ధి సాధిస్తే రాజ్యాధి . కారాన్ని అందిపుచ్చుకోవచ్చని మంత్రి ఎస్ సవిత అన్నారు. ఆదివారం మంగళగిరి పట్టణంలోని ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్ ఆవిష్క రించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేసన్న శంకర్రావు అధ్యక్ష వహించారు. మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీలంతా ఒకే వేదిక మీదకు రావడం సంతోషంగా ఉంద ని అన్నారు. తమ హక్కుల కోసం పోరాటం చేసి నేడు రాష్ట్ర మంత్రివర్గంలో ఎక్కువ మంది బిసి మంత్రులు ఉండే విధంగా చేయగలిగామని అన్నారు. బీసీలు మరింత ఐక్యంగా ఉంటే శాసించే స్థాయికి ఎదగవచ్చునని అన్నారు. బీసీలలో చిన్నప్పటి నుండే పిల్లలను చదివించా లని ఆమె కోరారు. చదువు ఉంటే రాజకీయం గా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెంద వచ్చునని అన్నారు. బీసీలు ఒకరోజు పని చేయకపోతే అభివృద్ధి నిలిచిపోతుందని మంత్రి అన్నారు. చట్టసభలలో బీసీల రిజర్వేషన్ కోసం పోరాటం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో బీసీ సంక్షేమ సంఘం యువజన జాతీయ కార్యదర్శి కే క్రాంతి కమార్, గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ జి గురుమూర్తి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకురాలు చంద్రకళ, గుంటూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.మహేష్, స్థానిక బీసీ సంక్షేమ సంఘం నాయకులు టి. కిరణ్, యు.శ్రీనివాసరావు, కే.శివరాం బాబాజీ, మహిళా నాయకులు కె స్వాతిగౌడ్ పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ పల్నాడు జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి జడ్పీహెచ్ఎస్ సుగాలిలో పల్నాడు జిల్లా స్థాయి సీనియర్ మెన్ ఫుట్‌బాల్ సెలక్షన్ ట్రయల్స్ ఆదివారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విశ్రాంత హెచ్ఎం వెంకటాద్రి, పీడీలు ఎ.శ్రీరామ్‌రెడ్డి, డి.శ్రీనివాసరావు, అచ్చిరెడ్డి, నరసింహారావు , వెంకటేష్ రెడ్డి, పాఠశాల పీడీ రియాజ్, విశ్రాంత పీఈటీ ఎస్.నాగిరెడ్డి, సీనియర్ క్రీడాకారులు ఎస్‌కే ఇర్ఫాన్, ఆర్మీ జవాన్ నాని పాల్గొన్నారు. పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో జట్టు ఎంపిక చేపట్టారు. వీరికి సుగాలి స్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అనురాధ, టిడిపి నాయకులు సయ్యద్ పెద్దకరిముల్లా, జాన్ బాబు , రాంబో తదితరులు పాల్గొన్నారు.



పోరాటం ద్వారానే విద్యార్థుల సమస్యల పరిష్కారం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

విద్యార్థులు సమస్యలపై అలుపెరిగిన పోరాటం చేస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు నవిత అన్నారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో ఎస్ఎఫ్ఐ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సాయి సంజయ్, కార్యదర్శిగా సాయికుమార్‌తోపాటు మరో ఎనిమిది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నవిత మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అమూల్య పాల్గొన్నారు.

ఆసక్తిగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికపై పట్టణంలో జోరుగా చర్చ సాగుతోంది. పదవి ఎవరికి వరిస్తుందన్న అంశంపై ఎవరికి వారు లెక్కలు వేస్తున్నారు. ఇది వరకు మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్న కొమ్ము ముక్కంటి అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలో మొత్తం మూడు మున్సిపాలిటీలను ఏకగ్రీవం చేసుకుంది. అందులో పిడుగురాళ్ల మున్సిపాలిటీ ఒకటి. మొత్తం 33 మంది కౌన్సిలర్లను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కైవసం చేసుకుంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉన్నం ఆంజనేయులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. దీంతో వైసీపీ సంఖ్య 32కు చేరుకుంది. సోమవారం పిడుగురాళ్ల మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌కు ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో మున్సిపాలిటీ అధికారులు అందుకు సర్వం సిద్ధం చేశారు. టీడీపీకి తగిన బలం లేకపోవడం వల్ల ఈ ఎన్నికల్లో నామమాత్రంగానే ఉండిపోనుందని.. 32 మంది కౌన్సిలర్లు ఉన్న వైసీపీనే మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌ను మళ్లీ కైవసం చేసుకుంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అది కూడా ఎవరిని వరిస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మరణించిన కొమ్ము ముక్కంటి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో అదే సామాజిక వర్గానికి ఆ పదవి దక్కుతుందా.. ఇంకేమైనా పోటీ ఉంటుందా? అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

దిగుబడి ఆశాజనకం.. ధర పతనం

- ఘాటెక్కని మిర్చి
- కనీస ధర కరువు
- నష్టాలకే విక్రయం
- దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు
- పట్టించుకోని ప్రభుత్వం



ప్రజాశక్తి -దాచేపల్లి

రైతు సంక్షేమమే తమ ధ్యేయమంటూ.. కల్లబొల్లి మాటలు చెప్పి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎప్పటిలాగానే రైతులను దగా చేస్తోంది. అధికారంలో లేనప్పుడు రైతులపై లేనిపోని ప్రేమలు చూపి, తీరా అధికారంలోకి వచ్చిన తరువాత అన్నదాతలకు ఒక్క రూపాయి కూడా సాయం చేసిన దాఖలాలు లేవు. ప్రభుత్వం నుంచి రైతులకు భరోసా వంటి పథకాలకు కూడా ఎగనామం పెట్టింది. ఈ ఏడాది మండలంలోని అన్ని గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 11,200 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా, 8276 ఎకరాల్లో మిర్చి పంట, 2,400 ఎకరాల్లో కంది పంట, 694 ఎకరాల్లో వరి పంట సాగవ్వగా.. మిగిలిన 430 ఎకరాల్లో కూరగాయల పంటలను పండించారు. ఈ ఏడాది మిర్చి పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా.. పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టాల బారిన పడుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి మిర్చికి కనీసం మద్దతు ధర కూడా లేదని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరంలో తేజ రకం పండించిన రైతులు లాభాలు రావడంతో ఈ ఏడాది కూడా అదే రకాన్ని సాగు చేసి గిట్టుబాటు ధర లేక నష్టాలకు అమ్ముతున్నారు. మిర్చి మొక్క కొనుగోలు మొదలుకొని.. యార్డులో అమ్ముకునేంత వరకు రైతులు బాగా ఖర్చు చేయాల్సి వస్తోంది. వ్యవసాయం ఖర్చులతోపాటు, వ్యవసాయ కూలీలు, కాంప్లెక్స్ ఎరువులు ఖర్చుతో పాటు మిర్చి పైరుపై వచ్చే వివిధ రకాల పురుగులు, తెల్లదోమ, నల్లి, చిలక, మొదలగు కీటకాలను నివారించేందుకు పురుగు మందుల వాడకం బాగా పెరిగిపోయింది. మందులు ఖర్చు కూడా ఆ స్థాయిలోనే పెరిగి.. మొత్తంగా మిర్చి పంట పండించేందుకు ఎకరాకు రూ.లక్షన్నర నుంచి రెండు లక్షల రూపాయల వరకు పెట్టుబడి అవుతోందని రైతులు వాపోతున్నారు. ఆరుకాలం పండించిన పంటను అమ్ముకునే సమయంలో గిట్టుబాటు ధర లేక తక్కువ ధరకు విక్రయించి నష్టాలు ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ సంవత్సరం కాలంలో మిర్చి వేసిన రైతులకు తేజ, ఆర్మూరు, నాటుతో పాటు వివిధ రకాల్లో పంట దిగుబడి నామమాత్రంగానే ఉన్నప్పటికీ.. ధరలు మాత్రం భారీగా పతనం అవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి



గత సంవత్సరంలో తేజ రకాన్ని పండించాం. మంచి లాభాలొచ్చాయి. ఈ ఏడాది కూడా అదే రకాన్ని రెండెకరాల్లో సాగు చేశాం. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టాం. గిట్టుబాటు ధర లేక నష్టాలను చవి చూడవలసి వస్తోంది. ప్రభుత్వమే మిర్చి రైతులను ఆదుకోవాలి.

- బొమ్మిరెడ్డి శ్రీనివాసరావు, రైతు

ధర రావడం లేదు..



మిర్చి పంటకు అసలు ధర రావడం లేదు. ఇదే కొనసాగితే భారీగా నష్టాలను చూడాల్సి వస్తుంది. ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలి. నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు స్పందించి.. మిర్చి ధరల పతనాన్ని కేంద్ర వాణిజ్య శాఖ దృష్టికి తీసుకెళ్లాలి. రైతులకు మేలు చేయాలి.

- గరికపాటి గురవయ్య, రైతు

ఎడ్లు, కోళ్ల పందేలు సంస్కృతిలో ఒక భాగం : ఎమ్మెల్యే పుల్లారావు

ప్రజాశక్తి-నాదెండ్ల

నిత్యం వ్యవసాయ పనులతో తీరిక లేకుండా గడిపే రైతులు, రైతు కూలీలు.. గ్రామాల్లో జరిగే కొన్ని ప్రత్యేక కార్యక్రమాల్లోనే తమ కుటుంబాలు, బంధుమిత్రులతో సంతోషంగా గడుపుతారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం నాదెండ్ల మండల కేంద్రంలో జాతీయస్థాయి ఒంగోలు ఎడ్ల పందాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎడ్లు, కోళ్ల పెంపకం, పందాలు మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమన్నారు. ఒంగోలు గిత్తలు రాజసం, పౌరుషాలకు పెట్టింది పేరన్నారు. పశువులు రైతులకు నిజమైన నేస్తాలని.. వాటి ఆలనాపాలనలోనే తమ సంతోషం వెతుక్కుంటారన్నారు. ఈ సందర్భంగా పందాల నిర్వాహకులను, ఎడ్ల యజమానులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ కరిముల్లా, నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మదన్మోహన్, కామినేని సాయిబాబు, హరిబాబు, నన్నపనేని హరీష్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు

విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం

ప్రజాశక్తి- మాచర్ల

పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) మాచర్ల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు ఆమోదించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులుగా చైతన్య, కార్యదర్శిగా రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడిగా శంకర్, టౌన్ అధ్యక్షులుగా జెస్సిలను ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు రాజు మాట్లాడుతూ.. మాచర్ల ప్రాంతంలో పీజీ సెంటర్‌ను, జిల్లాలో యూనివర్సిటీ, ప్రభుత్వ ఫార్మసీ కళాశాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు ఉచితంగా బస్సు పాసులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలపై అధికార యంత్రాంగం స్పందించి సమగ్ర విచారణ జరపాలని కోరారు. నూతన కార్యదర్శిగా ఎన్నికైన రాఘవేంద్ర మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి స్ఫూర్తితో రానున్న రోజుల్లో మాచర్ల ప్రాంతంలో విద్యార్థుల సమస్యల పట్ల పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జ్యోతిష్ కుమార్, భాను, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ ద్వారా విస్తృతంగా కార్యక్రమాలు

ప్రజాశక్తి - వినుకొండ

నూజెండ్ల మండలం పమిడిపాడులో తులసీమాత ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సతీమణి, శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఛైర్ పర్సన్ లీలావతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెకు సాదర స్వాగతం పలికి, ప్రత్యేకంగా సత్కరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారందరికీ వేదాశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ సతీమణి



లీలావతి మాట్లాడుతూ.. అందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆశయం మేరకు, ప్రభుత్వం ద్వారా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. తమ సంస్థలు, శివశక్తి ఫౌండేషన్ ద్వారా స్థానికంగా చేయూత లభించాలనే ప్రార్థించినట్లు తెలిపారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి వినతులిచ్చేందుకు ఎవరూ రావద్దని సూచించారు. ఎస్పీ కార్యాలయంలో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని సైతం ఎన్నికల కోడ్ నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

ఘనంగా జెనిత్ హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి- మాచర్ల

పట్టణంలోని శ్రీ జెనిత్ హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంఈవోలు షేక్ జఫరుల్లా, అల్లి సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ దశరథ్, పిజెనెన్ ధన్, లెక్చరల్ వెంకటరామిరెడ్డి, పాఠశాల డైరెక్టర్ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.





మంగళగిరిలో..



తెనాలిలో..


ఫిరంగిపురం మండలం పొనుగుపాడులో

దగా బడ్జెట్‌పై సిపిఎం శ్రేణుల ధ్వజం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రాష్ట్ర రాజధాని అమరావతికి కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయించకుండా అభివృద్ధి ఎలా సాధ్యమని సిపిఎం నాయకులు ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా తాడేపల్లి పట్టణం ఉండవల్లి సెంటర్లో సిపిఎం శ్రేణులు నిరసన తెలిపాయి. సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, వేముల దుర్గారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కార్పొరేట్ల కోసమేగాని ప్రజలకు ఉపయోగపడేలా లేదని, పేదల అభ్యున్నతికి ఏమాత్రమూ ఉపయోగపడని అన్నారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా ఎన్‌డిఎలో భాగస్వామి పార్టీలైన టిడిపి, జనసేన నిలదీయకపోవడం దుర్మార్గమన్నారు. విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా అధికారం చేపట్టిన కూటమి పార్టీలు రాష్ట్ర ప్రజలను మరోమారు మోసం చేశాయని విమర్శించారు. ఒకవైపున ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, పేద మధ్యతరగతి సామాన్య ప్రజలపైన అధిక భారాలు వేసే కేంద్రంలోని బిజెపి విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. ఆంధ్ర రాష్ట్రానికి


తాడేపల్లి మండలం ప్రాతూరులో

ప్రత్యేక హోదా ఇవ్వని, రాజధానికి నిధులు కేటాయించని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వానికి భవిష్యత్తులో ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో రామకృష్ణ, ఇ.రామారావు, ఇమ్మానుయేలురాజు, ఎన్.నాగేశ్వరరావు, బి.రామారావు, ఎస్‌కె బాష, కె.మేరీ, కె.శేషయ్య, ఎ.శౌరి, ఐ.ఇస్సాక్, డి.విజయ్, గాంధీ పాల్గొన్నారు. కుంచనపల్లి ప్రాతూర్ రోడ్డు, జాతీయ రహదారి వద్ద సిపిఎం శ్రేణులు నిరసన చేపట్టగా సిపిఎం మండల కార్యదర్శి పి.కృష్ణ, కాజా వెంకటేశ్వరరావు, జొన్న శివశంకరరావు, డి.వెంకటరెడ్డి మాట్లాడారు. ఎ.రంగారావు, ఎన్.విజయరాజు, బి.శివారెడ్డి, కె.సాంబశివరావు, ఎ.రామారావు, నాగరాజు, శ్రీనివాసరావు, సిహెచ్.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య విమర్శించారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో నిరసన చేపట్టగా రాఘవులు, చెంగయ్య మాట్లాడుతూ విభజన హామీలు, ప్రత్యేక హోదాకు సంబంధించిన అంశాలు బడ్జెట్లో ఏమీ లేవని అన్నారు. రాజధాని అమరావతి ప్రస్తావనే లేదని విమర్శించారు. అయినా ఈ బడ్జెట్‌కు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్వాగతించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి టిడిపి, జనసేన పార్టీలు తాకట్టు పెడుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను విస్మరిస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు వై.కమలాకర్, ఎం.బాలాజీ, నాయకులు ఎం.చంద్ర, ఎం.నాగేశ్వరావు, ఎం.చలపతిరావు, ఎస్.గణేష్, రాజధాని డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు, ప్రజా సంఘాల నాయకులు ఎస్.కోటేశ్వరరావు, జానీబాష, సత్తార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్ర రాజధాని అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం సిగ్గుచేటని సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు విమర్శించారు. మండలంలోని నిడమర్రులో సిపిఎం శ్రేణులు నిరసన చేపట్టగా భాగ్యరాజు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన దగ్గర నుండి ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం రూ.1500 కోట్ల మాత్రమే కేటాయించిందని, ఈ తొమ్మిదేళ్లలో రాజధాని నిర్మాణానికి నిధులేమీ కేటాయించలేదని అన్నారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో ఆటలాడితే దానికి అనుగుణంగా బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం.. రాజధాని అంశం రాష్ట్ర ప్రభుత్వాలు చూసుకుంటాయని కోర్టుకు చెప్పాయని, ఇప్పుడు నిధులు కేటాయించకుండా విస్మరించాయని అన్నారు. రాజధానికి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామంటూ రాష్ట్రంలోని బిజెపి నాయకులు చెబుతున్నా చేతల్లో మాత్రం చిల్లిగవ్వకూడా ఇవ్వడం లేదన్నారు. ఈ బడ్జెట్‌పై జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏం చెబుతారని ప్రశ్నించారు. అప్పులు తెచ్చి రాజధానిని నిర్మిస్తామంటూ సిఎం చంద్రబాబు చెబుతున్నారని, మళ్లీ ఆ అప్పుల భారాన్ని ప్రజలపై మోపుతారా? అని నిలదీశారు. విభజన హామీలను అమలు చేయించుకుంటే అప్పులు చేయాల్సిన గతి ఉండదన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు సాధించాలన్నాని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.నాగేశ్వరరావు, ఎం.రాజముని, కె.ప్రకాష్‌రావు, కె.నాగేశ్వరరావు, యు.నాగరాజు, కె.వీరయ్య, ఎం.అంకమ్మరావు, కె.నానయ్య పాల్గొన్నారు. ఆత్మకూరులో నిరసన తెలిపారు. సిపిఎం నాయకులు జి.అజయ్ కుమార్, సిహెచ్.సీతారామాంజనేయులు, డి.శర్మ, సిహెచ్.జనార్ధనరావు, బాబ్జి, వి.సురేష్, ఎం.సంధ్య, లక్ష్మి పాల్గొన్నారు

ప్రజాశక్తి - తుళ్లూరు

స్థానిక లైబ్రరీ సెంటర్‌లో నిరసన చేపట్టగా సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు మాట్లాడారు.



తుళ్లూరులో..

పి.బాబురావు, జి.నాగేశ్వరరావు, జె.నరేంద్ర, పి.శివయ్య, బి.ఆనందరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

వ్యవసాయ రంగంతోపాటు రాష్ట్ర రాధానికి నిధులు కేటాయించకపోవడంపై మండలంలోని పొనుగుపాడులో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, నాయకులు జి.బాలకృష్ణ, కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్ మరోసారి నిరాశ కలుగజేసిందన్నారు. విభజన చట్టం హామీల అమలకు నిధులు కేటాయించలేదని, కొత్త సంస్థల కేటాయించలేదని అన్నారు. వ్యవసాయ రంగాన్ని బతికించుకోవడం కోసం బడ్జెట్లో చర్యలేమీ ప్రకటించలేదన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే దిశగా బడ్జెట్ ఉందన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సిపిఎం శ్రేణుల నిరసనలో కె.బాబుప్రసాద్ మాట్లాడారు. తమకిచ్చే రూ.వెయ్యి పెన్షన్ పెంచుతారని ఎదురుచూస్తున్న పారిశ్రామిక కార్మికులకు ఆశాభంగం కలిగించారని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి ప్రస్తుత ధరలకు అనుగుణంగా నిధులు కేటాయించలేదన్నారు. ఎం.శివసాంబిరెడ్డి మాట్లాడుతూ బడ్జెట్ కారణంగా ఎరువుల ధరలకు రెక్కలొచ్చే ప్రమాదం ఉందన్నారు. షేక్ హుస్సేన్‌వలి మాట్లాడుతూ ప్రజల్లో కొనుగోలు శక్తి పెంచకుండా ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో పి.రాజశేఖర్, ఎం.యలమందయ్య, కె.దుర్గాప్రసాద్, కె.భాస్కర్‌చంద్, బి.బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర

విభజిత ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించి, అభివృద్ధి చేస్తామని, రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు కేంద్రం సహకరిస్తుందని ఇచ్చిన హామీలు బడ్జెట్‌లో నెరవేరలేదని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.శివసాంబిరెడ్డి విమర్శించారు. ఎరువుల సబ్సిడీకి రూ.17వేల కోట్లు తగ్గించటం వల్ల ధరలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. కోటి మంది రైతుల్ని ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లిస్తామంటూ గొప్పలు చెప్పినా బడ్జెట్‌లో మాత్రం రూ.616 కోట్లతో సరిపెట్టారన్నారు. పిఎం కిసాన్ సమ్మాన్ యోజనకు గత బడ్జెట్‌తో పోల్చితే రూ.100 కోట్లు మాత్రమే కేటాయించిందని, పంటలకు మద్దతు ధరలపై స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో బి.సుబ్బారావు, కె.చంద్రశేఖర్, పి.శ్రీనివాసరావు, కె.పూర్ణచంద్రరావు, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

సిపిఎం శ్రేణుల నిరసనలో ఆ పార్టీ మండల కార్యదర్శి జె.బాలరాజు మాట్లాడారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు సరిగా కేటాయించలేదని విమర్శించారు. బి.అమ్మిరెడ్డి, సిహెచ్ పోతురాజు, శ్రీనివాసరావు, వై.బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.


దుగ్గిరాలలో..




మంగళగిరి మండలం నిడమర్రు, ఆత్మకూరులో


సమావేశంలో మాట్లాడుతున్న జంపని రఘురాం

పూర్వ విద్యార్థుల చొరవతో ట్యూషన్ ఏర్పాటు

ప్రజాశక్తి - పెదనందిపాడు

పాఠశాల పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన ట్యూషన్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించడం ద్వారా పాఠశాలకు మంచి పేరు తేవాలని పాలపర్రు శ్రీ నారసింహ ప్రభుత్వ పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం శ్యాంబాబు కోరారు. పాఠశాల పూర్వ విద్యార్థులు స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మైత్రి కోచింగ్ సెంటర్‌ను విశ్రాంత ఉద్యోగి పెన్సనర్స్ సంఘం అధ్యక్షులు జంపని రామారావు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి డి. రమేష్‌బాబు అధ్యక్షత వహించగా శ్యాంబాబు మాట్లాడుతూ స్కాలర్‌షిప్, ఇతర కాంపిటేటివ్ పరీక్షలకు తర్ఫీదు పొందే అవకాశం ఇక్కడుందన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి జంపని రఘురాం మాట్లాడుతూ తాను చదివిన పాఠశాల అభివృద్ధి కోసం తనవంతు సహాయసహకారాలు అందిస్తానని చెప్పారు. విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యమన్నారు. రమేష్‌బాబు మాట్లాడుతూ ట్యూషన్ సెంటర్ ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుండి 9 గంటల వరకు నడుస్తుందని, ఎవరైనా రావొచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముద్దన సత్యనారాయణ, షఫీ, రహీమ్, ట్యూషన్ టీచర్లు నాగార్జున, నవీన్, వీరకుమారి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల కోసం 7న ధర్నా : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

వడ్డేశ్వరంలో పేదలకు గృహ నిర్మాణ పథకం ద్వారా నివాస ప్రాంతాల్లోనే ఇల్లు నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి పి.కృష్ణ డిమాండ్ చేశారు. ఈ అంశంపై 7న ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. వడ్డేశ్వరంలో ఇళ్ల స్థలాలు పట్టాల బాధితులతో సమావేశం కె.స్వాతి అధ్యక్షతన ఆదివారం జరిగింది. పి.కృష్ణతోపాటు సిపిఎం సీనియర్ నాయకులు డి.వెంకటరెడ్డి మాట్లాడుతూ ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.5 లక్షలివ్వాలని, మరో ఐదు రూ.లక్షలు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన లేఅవుట్ ప్లాట్లలో ఉన్న విద్యుత్ పోల్స్ తొలగించి, ఇల్లు నిర్మించుకునేందుకు అడ్డు లేకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసినా ఇళ్లు నిర్మించలేన్నారు. అర్హులైన పేదలకు రాజధాని ప్రాంతంలో ఇల్లు కేటాయిస్తామని గత ప్రభుత్వం చెప్పి, రాజధానిలో కేటాయించారని, కూలి నాలి చేసుకునే పేదలు అక్కడికెళ్లి ఉపాధి చూసుకోవాలంటే కష్టసాధ్యమని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా, నివాస ప్రాంతాల్లోనే పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పున స్థలాలిచ్చి ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై మంగళగిరిలోని మున్సిపల్ కార్యాలయం వద్ద 7వ తేదీన జరిగే ధర్నాలో పేదలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం నాయకులు వి.రాజు, వి.చిన్న, వి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డి.వెంకటరెడ్డి

5న విద్యార్థుల సమస్యలపై 'ఫీజు పోరు'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఫీజులు కట్టలేక విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 5న ఫీజు పోరు కార్యక్రమం తలపెట్టినట్లు చెప్పారు. ఇందులో భాగంగా గుంటూరు రోడ్డులోని వైసిపి కార్యాలయం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించే ఫీజు పోరు ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం వైసిపి కార్యాలయంలో ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చే నాటికి ఉన్న రూ.2800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ.148 కోట్ల మధ్యాహ్న భోజనం పథకం బకాయిలు చెల్లించడంతోపాటు జగనన్న విద్యా కానుక, జగనన్న వసతి దీవెన, అమ్మ ఒడి పథకాలను ప్రవేశపెట్టి పేద విద్యార్థులకు విద్యను చేరువ చేశారని గుర్తు చేశారు. గతంలో ఒక నిర్ణీత మొత్తం మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండేదని.. కళాశాలల్లో ఎంత ఫీజు ఉన్నా అంతా ప్రభుత్వమే భరించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 3,900 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఫీజులు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లి దండ్రులతో కలిసి ఫీజు పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు, ప్రజల పక్షాన పోరాటం నిరంతరం పోరాటం చేస్తామన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

జనం తరిమి కొడతారు : జూలకంటి

ప్రజాశక్తి -రెంటచింతల

విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు బకాయిలను చెల్లించకుండా, వైసీపీ నేతలు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పోరంటూ రోడ్డు ఎక్కితే జనం తరిమికొడతారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు. ఆదివారం రెంటచింతల మాజీ సర్పంచ్ అల్లం ప్రతాపరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాలనూ నిర్వీర్యం చేసిందన్నారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి వస్తే ఎవరు ఏం చేశారో తెలుస్తుందన్నారు. కళాశాలలకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయకుండా పెండింగ్లో ఉంచితే ఆ బకాయిలను కూటమి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిందని గుర్తు చేశారు. చంద్రబాబు నేతత్వంలో పోలవరం, అమరావతికి మంచి రోజులు వచ్చాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా ఉందన్నారు. దుర్గి మండలం ముటుకూరు గ్రామంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, సుమంత్ రెడ్డి, పల్లెర్ల లక్ష్మారెడ్డి, బోడపాటి రామకృష్ణ సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.





రేషన్ పంపిణీ సక్రమంగా లేకుంటే చర్యలు

ప్రజాశక్తి- మాచర్ల

మాచర్ల పట్టణ, మండల పరిధిలోని పలు రేషన్ దుకాణాలు, ఎండీయూ వాహనాలను తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బరువు తూచే కాటాలు, బిల్లు యంత్రాలను పరిశీలించారు. ప్రతినెలా రేషన్ సరకులను సక్రమంగా అందిస్తున్నారా? లేదా అని లబ్ధిదారులకు అడిగి తెలుసుకున్నారు. పేద ప్రజలకు మేలు చేసేందుకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం, కందిపప్పు తదితర సరకులను సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్లకు, ఎండీయూ ఆపరేటర్లకు ఆదేశించారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మహాసభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ 130 వసంతాల వేడుకలు, నూతన మందిర 4వ వార్షికోత్సవం ఈ నెల 12, 13, 14వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకల్లో భాగంగా మూడు రోజులపాటు ప్రతిరోజూ రాత్రి 7 నుంచి 'రక్షణ ఉజ్జీవ సువార్త మహాసభలు' సత్తెనపల్లి ఏబీఎం కాంపౌండ్(చర్చ్ మైదానం)లో ఉంటాయని పేర్కొన్నారు. ఈ సభలకు సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను సంఘ కాపరి రెవరెండ్ జరుగుమల్లి ఇశ్రాయేలు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గుజ్జర్లపూడి స్కైలాబ్, కార్యదర్శి కె.ఎం.ఆనిరాజ్, సంయుక్త కార్యదర్శి బంకా కిషోర్ బాబు, కోశాధికారి గుజ్జర్లపూడి రవిరాజు, కార్యవర్గ సభ్యులు సంగెపు నరేష్, దంతం కుమార్, ఆనందరావు, ఫ్రాన్సిస్, రాజరత్నం, జయపాల్ పాల్గొన్నారు.



కానుక మాత ఆలయంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రెంటచింతల

పల్నాడులో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని, పల్లెలన్నీ పాడిపంటలతో కళకళలాడాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం రెంటచింతలలోని కానుక మాత 175వ తిరుణాల మహోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఫాదర్ అగస్టీన్ ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఆయన వెంట సుమంత్ రెడ్డి, అబ్బిరెడ్డి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

యడ్లపాడు-1 ఇన్‌ఛార్జి వీఆర్వోగా చారి

ప్రజాశక్తి - యడ్లపాడు

కారుచోల గ్రామ రెవెన్యూ అధికారి కె.ఎ.చారిని యడ్లపాడు-1 ఇన్‌ఛార్జిగా నియమిస్తూ తహసీల్దార్ జె.విజయశ్రీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం యడ్లపాడు-1 గ్రామ రెవెన్యూ అధికారి ఎస్‌డి మహబూబ్ సుభానిని కలెక్టర్ సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో చారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

ప్రజాశక్తి-నకరికల్లు

వైసీపీలోని ప్రతి కార్యకర్తకూ తాను అండగా ఉంటానని ఆ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవరెడ్డి తెలిపారు. నకరికల్లులో ఆదివారం వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశ నిర్వహించారు. మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అధ్యక్షత వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ ఆదేశాల మేరకు సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించానన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజా క్షేత్రంలో ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి జగన్ ను ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఈ నెల 5న వైసిపి ఆధ్వర్యంలో జరిగే ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల శివారెడ్డి, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్ కుమార్ రెడ్డి, దూదేకుల బాషా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భార్గవరెడ్డి

మాచర్ల-చెన్నై బస్ రూటు మార్పు


ప్రజాశక్తి- మాచర్ల

మాచర్ల-చెన్నై బస్ రూట్‌లో మార్పు చోటు చేసుకున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి ఆదివారం తెలిపారు. మాచర్ల నుంచి పిడుగురాళ్ల, నర్సరావుపేట, చిలకలూరిపేట, ఒంగోలు మీదుగా చెన్నైకు బస్సు వెళుతుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ బస్సు వినుకొండ, పోదిలి మీదుగా వెళ్లేదని.. ప్రయాణికుల కోరిక మేరకు రూట్‌ను మార్పినట్లు తెలిపారు.

విద్యారంగంపై బడ్జెట్‌లో చిన్నచూపు : యుటిఎఫ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

2025 - 26 వార్షిక బడ్జెట్లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని.. నిరాశజనకంగా నిర్మలమ్మ బడ్జెట్ ఉందని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు పి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈసారి బడ్జెట్‌లో ప్రధానంగా విద్యా రంగానికి కేటాయింపులు దారుణంగా ఉన్నాయని విమర్శించారు. యూజిసి, ఎల్.ఐ.సిలలో కూడా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు తలుపులు తెరవడం తగదన్నారు. యూనివర్సిటీలను బలోపేతం చేసేందుకు ఎటువంటి చర్యలూ బడ్జెట్లో లేవన్నారు. బిహార్, ఢిల్లీ రాష్ట్రాలలో జరగనున్న ఎన్నికల దృష్ట్యా బడ్జెట్ ప్రకటించినట్లుగా ఉందని ఆయన విమర్శించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు తీరని అన్యాయం చేసిందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మలమ్మ కేంద్ర ఆర్థిక మంత్రిగా 8వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టారని, ఈ బడ్జెట్ వేతన జీవులకు అనుకూలంగా లేదని తెలిపారు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకే వరాల బడ్జెట్‌గా మారిందన్నారు.



జాతిని మేల్కొలిపేది కళ

ప్రజాశక్తి - వినుకొండ

జాతిని మేల్కొలిపేది కళ అని.. కళాకారులు వివిధ సమస్యలపై ప్రజలను చైతన్యపరచాలని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. వెల్లటూరు రోడ్డు లోని గుమ్మడి వృద్ధాశ్రమంలో జరిగిన గుమ్మడి కళా పీఠం కళాకారుల ఆత్మీయ సమావేశం సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. శివశక్తి మేనేజర్ జీవీ రమణ మాట్లాడుతూ కళాకారులను ఒక తాటి మీదకు తీసుకు వస్తున్న గుమ్మడి ఎంతో అభినందనీయుడని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పారెల్ల కృష్ణ, రావిపాటి వీరయ్య, పారెల్ల సుబ్రహ్మణ్యం, కీబోర్డు నాగేశ్వరరావు, ముఖ్యని రామయ్య, పారెల్ల దత్తు, బొంకూరి అజయ్ కుమార్‌లను ఘనంగా సత్కరించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో కంచర్ల నారాయణ, సుబ్బారావు, కోటిరెడ్డి, వెంకీనాయక్, రిటైర్డ్ హెచ్‌ఎం రమణారెడ్డి, అందరివాడు సద్దాం, ఎస్కే కాసిం వలి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కృషితోనే రాష్ట్రానికి నిధులు : చీఫ్‌విప్ జీవీ

ప్రజాశక్తి - వినుకొండ



సీఎం చంద్రబాబు కృషి, రాష్ట్రం పట్ల ప్రధాని మోదీకి ఉన్న ప్రత్యేక ఆదరణ బడ్జెట్ కేటాయింపుల రూపంలో మరోసారి స్పష్టంగా కనిపించిందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. కూటమిపై రాష్ట్ర ప్రజలు పెట్టుకున్న అపారమైన నమ్మకం, అందించిన అఖండ విజయం కేంద్ర నుంచి నిధుల రూపంలో వరదగా తిరిగి వస్తోందన్నందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గడిచిన బడ్జెట్‌లో, ఈ బడ్జెట్‌లో కూడా రాష్ట్రం పేరు పెట్టి మరీ ప్రత్యేక కేటాయింపులు ఇవ్వడం.. ప్రాజెక్టుల వారీగా నిధులు మంజూరు పట్ల కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు గతేడాది ఇచ్చిన రూ.5,512 కోట్ల కంటే రూ.424 కోట్లు అదనంగా రూ.5936 కోట్లు ఇవ్వడం రాష్ట్ర జీవనాడి పూర్తిపై ఆశలు, నమ్మకాన్ని కలిగించిందని చెప్పారు. ఎన్డీయే కొత్త ప్రభుత్వంలోనే పోలవరం తాజా డీపీఆర్ ఆమోదించారన్న జీవీ.. తద్వారా రూ.12,157 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించారని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టుకు ఇప్పటి వరకు వచ్చిన నిధుల్లో ఇవే అత్యధికం అన్న ఆయన ప్యాకేజీలో భాగంగా అడ్వాన్స్ కూడా ఇవ్వడంతో ఇప్పటికే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అదే సమయంలో విశాఖకు ఇచ్చిన హామీని నెరవేర్చుతూ ప్యాకేజీని అమల్లోకి తేవడం రాష్ట్రంలో, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాల చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. ఇటీవల ప్రకటించిన రూ.11,917 కోట్లు ప్యాకేజీని నిజం చేస్తూ పాత బడ్జెట్‌లో కేటాయింపుల్ని రూ.620 కోట్ల నుంచి రూ.8,622 కోట్లకు పెంచడం.. కొత్త బడ్జెట్‌లో 3,295 కోట్లు కేటాయించడం సీఎం చంద్రబాబు, పీఎం మోదీ సంకల్పం కారణంగానే సాధ్యమైందన్నారు. బడ్జెట్‌లో కీలకంగా ప్రస్తావించిన జల్‌జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రానికి భారీగా నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. మౌలిక సదుపాయల కల్పనకు కేంద్రం ప్రకటించిన రూ.1.5లక్షల కోట్ల ప్యాకేజీలో ఏపీకి మంచి నిధులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. పరోక్షంగా అమరావతి, మెట్రో రైలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, వ్యవసాయం, విద్య రంగాల్లో భారీగా నిధుల రాకకు అవకాశం ఉందని... ఆ మార్గాల్ని సద్వినియోగం చేసుకుంటామన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

శ్రీకృష్ణ జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నరసరావుపేట కొండవీటి ఆసుపత్రి సహకారంతో ఆదివారం పట్టణంలో ఈఎన్‌టి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ గుర్రం రాజశేఖర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, కె.వర్షిణి, వై.రామచంద్ర రెడ్డి తదితరులు సుమారు 150 మందికి చెవి, ముక్కు, గొంతు, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.



ఘనంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి పారా క్రీడా పోటీలు

ప్రజాశక్తి మంగళగిరి

పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 7వ పారా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు మంగళగిరిలోని 6వ ఎ.పి.ఎస్.పి. బెటాలియన్ గ్రౌండ్‌లో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన స్పోర్ట్స్ అథారిటీ అఫ్ ఆంధ్రప్రదేశ్, వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గిరీష పి.ఎస్. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషద్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలిసి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. అనంతరం సమావేశంలో సాప్ ఎం.డి. గిరీష్ మాట్లా డుతూ పారా క్రీడాకారుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందిం చేందుకు, వారిలో దాగి వున్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహద పడతాయని అన్నారు. గ్రంథాలయ పరిషద్ చైర్మన్ మరియు పారా స్పోర్ట్స్ రాష్ట్ర అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ షాట్ పుట్,



ప్రారంభోత్సవంలో అతిథులు.. హాజరైన క్రీడాకారులు

పరుగు, జావాలిన్ త్రో, డిస్కస్ త్రో, లాంగ్ జంప్ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి 500 మంది వరకు పారా క్రీడాకారులు పాల్గొనగా వీరిలో వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన క్రీడాకారులను ఫిబ్రవరి 17 నుండి 20 వరకు చెన్నైలో జరగబోయే జాతీయ స్థాయి పారా క్రీడా పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు. పారా క్రీడాకారులను ప్రోత్స హించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారని ,వారి కొరకు విశాఖపట్నంలో 25 ఎకరాలు కేటా యించారని తెలిపారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులను గిరీష సర్టిఫికెట్, మెడల్స్, నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి రామస్వామి, ట్రైన్ ట్రస్ట్ సంస్థ నేషనల్ హెడ్ ప్రియారంజన్ బీదర్, పారా స్పోర్ట్స్ ఫిజియోతెరఫిస్ట్ డాక్టర్. శ్రీ కష్ణ చైతన్య, గుంటూరు పారా స్పోర్ట్స్ అధ్యక్షులు ఎల్లయ్య తో పాటుగా అన్ని జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో పోలీసులు తనిఖీలు



మందుబాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారికి కౌన్సి లింగ్ ఇచ్చి, హెచ్చరించేందుకు, తాడేపల్లి పోలీసులు ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు తనిఖీలు చేపట్టారు. తాడే పల్లి పరిధిలోని మహానాడు, కష్ణానది కరకట్ట విజయవాడ క్లబ్ రోడ్డు, తదితర ప్రాంతాలలో సీఐ కళ్యాణ రాజు ఆధ్వర్యంలో, ఎస్సై ఖాజావలి బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న మందు బాబులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇకమీదట బహి రంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామంటూ హెచ్చరించారు.

టిప్పర్ ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణ పరిధిలోని బైపాస్ పరిధిలో జనసేన రాష్ట్ర కార్యాలయం వద్ద ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చిన్న కాకానికి గ్రామానికి చెందిన కోటేశ్వరావు అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ తాగి డ్రైవింగ్ చేస్తున్నట్టుగా తెలిసింది. కోటేశ్వరరావు తన వాహనంపై మరో వ్యక్తితో కలిసి మంగళగిరి వెళుతుండగా టిప్పర్ అతివేగంగా వచ్చి వాహనాన్ని ఢీకొనడంతో కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి



మృతి చెందిన కోటేశ్వరరావు

చెందాడు. వాహనంపై ఉన్న మరో వ్యక్తికి ఎటువంటి గాయాలు కాలేదు. కాగా స్థానికులు టిప్పర్ డ్రైవర్‌కి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పట్టణ పోలీసులు సంఘటన ప్రాంతాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సత్యషిర్డీ సాయి మందిర వార్షికోత్సవానికి సర్వం సిద్ధం : పాతూరి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పెదవడ్లపూడి భగవాన్ శ్రీ సత్య షిరిడి సాయిబాబా మందిరంలో ఈ నెల మూడో తేదీన అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే మందిరం 19 వార్షికోత్సవ మహోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు మందిరం చైర్మన్ పాతూరి నాగభూషణం అన్నారు. మహోత్సవాల ఏర్పాట్ల ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. మందిరంలో ఉదయం కాగడా హారతితో బాబా వారి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయన్నారు. బాబాను దర్శించుకునేందుకు మంగళగిరి పట్టణ పరిసర ప్రాంతాలతో పాటు హైదరాబాద్, అమెరికా నుండి కూడా ప్రము ఖుల హాజరవుతారన్నారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, ఉన్నతాధికారులు, బాబాని దర్శించుకోవడానికి వస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సుమారు 70000 మందికి భారీ అన్నదాన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పాతూరి నాగభూషణం

కార్యక్రమంలో ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 8 గంటల నుంచే అన్నదాన కార్య క్రమం ప్రారంభమవుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాబా వారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని పాతూరి విజ్ఞప్తి చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

వీసీల నియామకంలో ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ప్రభుత్వము యూనివర్శిటీలను మూసివేసే కుట్రలకు తెరలేపిందని, వైస్ ఛాన్సలర్లను గవర్నర్లకు కట్టబెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా బందెల నాసర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను మరింత కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, కాషాయకరణ చేసే దిశగా బీజేపీ పూనుకుంటుందని అన్నారు. యూజీసీ ముసాయిదా పేరుతో తీసుకుంటున్న చర్యలు, పరిపాలనా పరమైన సమస్య కాదనీ, ఇది భారత రాజ్యాంగ నిర్మాణంపై దాడి అని ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశంలో విశ్వ విద్యాలయాల సైదాంతిక నియంత్రణ కార్పొరేట్ శక్తులు లాభదయాక సాధనగా హిందుత్వ ప్రచార సాధనాలుగా మారకుండా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాసరయ్య, రాజేష్, భరత్ పాల్గొన్నారు.

ఘనంగా కొమ్మారెడ్డి కిరణ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

టిడిపి తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఉదయం గుండిమెడలో కొమ్మారెడ్డి యువసేన ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. గ్రామంలోని కిరణ్ ఇంటి వద్ద టిడిపి శ్రేణులు కేక్ కటింగ్ నిర్వహించారు. కిరణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు గుండిమెడ రమేష్‌బాబు, సీనియర్ నాయకులు కొమ్మారెడ్డి వెంకటేశ్వరరావు (బుజ్జి), టిడిపి గ్రామ అధ్యక్షులు చిగురుపాటి సుబ్బారావు, కార్యదర్శి నామతోటి రాంబాబు, కార్యకర్తలు, కిరణ్ అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కిరణ్ పుట్టినరోజు సందర్భంగా చినకాకాని షైన్ ఆనంద శరణాలయంలో పెనుమాకకు చెందిన తెలుగు



గుండిమెడలో కేక్‌నుకట్ చేస్తున్న టిడిపి శ్రేణులు

యువత నాయకులు కొల్లి సురేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను చిన్నారులు, నాయకులు కట్ చేశారు.

కార్మికులంటే ఎందుకీ నిర్లక్ష్యం?

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



ఎసిసి కార్మికులంటే ప్రభుత్వానికి ఎందుకంత నిర్లక్ష్యమని ఎసిసి కార్మికుల పోరాట సాధన కన్వీనర్ కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఎసిసి కార్మికుల రిలే నిరాహార దీక్షలను ఆదివారం బి.సూర్యప్రకాష్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. హక్కుల కోసం, చట్టబద్ధంగా కార్మికులకు రావాల్సిన నష్టపరిహారం కోసం కార్మికులు పోరాడుతుంటే పాలక పక్షాలు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించటం సిగ్గుచేటన్నారు. కార్మికులు కోరేవి గొంతెమ్మ కోర్కెలు కాదన్నారు. దీక్షల్లో పిచ్చయ్య, సుబ్బారావు సుభాని, మోహన్‌రావు, టి.నాగేశ్వరరావు కూర్చున్నారు. బి.అంకయ్య, శారద, వై.యెహోషువా, టి.దుర్గా భవాని, సారమ్మ, రమాదేవి, బాష, ఇస్మాయిల్, నవనీతం, సుబ్బారావు, సాంబయ్య సంఘీభావం తెలిపారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

సిల్వర్ జూబ్లీ వేడుకలతో పూర్వ విద్యార్థులు సంబరం

ప్రజాశక్తి - తెనాలిరూరల్

పాఠశాల విద్యను పూర్తి చేసుకున్న 25 ఏళ్ల తరువాత అందరూ కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. తెనాలి మారీస్‌పేటలోని నల్లమోతు చెంచు రమానాయుడు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఈ ఆత్మీయ సమ్మేళనంను ఉత్సహంగా జరుపుకున్నారు. ఆదివారం స్థానిక సుల్తానాబాద్ హెూటల్ స్వర్ణ ఇన్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు అందరు ఒకేచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి మధుర స్మతులు స్మరించుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అప్పటి అధ్యాపకులను ముఖ్య అతిధిలుగా పిలుచుకుని సత్కరించారు. దాదాపు 25 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థు లను అందరని కలుసుకోవడం సంతృప్తిగా ఉందని గురు వులు సంతోషాన్ని వ్యక్తం చేసారు. ఇక ముందు కూడా ఇదే విధంగా ప్రతి ఏడాది కలుసుకోవాలని భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయసహకారాలు అందించాలని ఆకాంక్షించారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హిమబిందు

ఉచిత దంత వైద్యశిబిరం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన బెస్ట్ డెంటల్ కె ఇంప్లాంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మారీసుపేట అప్పలస్వామి గుడి వద్ద ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణ త్రీ టౌన్ సిఐ ఎన్ రమేష్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. సెంటర్ నుంచి ప్రతివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిబిరంలో ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ హిమబిందు ఓగిరాల రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో నిర్వాహక బందం పాల్గొన్నారు.

గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పొందాలి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని వీవర్స్ కాలనీలోని దామర్ల త్యాగరాజు కోమలి జ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గ్రంథాలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయని వివరించారు. విద్యార్థులు జ్ఞానాన్ని పొందవచ్చునని అన్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయాలను జ్ఞాన కేంద్రాలుగా అభివందించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఎస్ ఎల్ చైతన్య హైస్కూల్ డైరె క్టర్ ఎస్ బాలకష్ణ, గ్రంథాలయ నిర్వాహకులు గోలి ధర్మతేజ, ఏ.ప్రదీప పాల్గొన్నారు.

చేపల పెంపకం.. లాభదాయకం...

పల్నాడు జిల్లా మత్స్య శాఖాధికారి ఎస్.సంజీవరావు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులు వివిధ రకాల పంటల సాగుతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలపై దష్టి సారించడం ద్వారా ఆర్థికాభివద్ధి సాధించవచ్చని ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జిల్లా మత్స్య శాఖ అధికారి ఎస్.సంజీవరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఊర చెరువులు, కుంటలకే పరిమితమైన చేపల పెంపకం ప్రస్తుతం భూములు నీటి వసతి ఉన్న రైతులు మొగ్గుచూపుతున్నారని చేపల పెంపకం సాగుకు ముందుకు వచ్చిన రైతులకు సలహాలు, సూచనలు ఇస్తూ శాఖాపరంగా సమర్థవంతంగా పని చేస్తున్నామని ఆయన అన్నారు. ప్రస్తుతం పల్నాడు జిల్లాలో చేపల పెంపకం అన్ని విధాలా లాభసాటిగా ఉందని చెప్పారు. చేపల పెంపకం ఖర్చుతో కూడుకున్నదైనప్పటికీ ఎక్కువ లాభాలు ఆర్జించే అవకాశాలు ఉండడంతో రైతులు చేపల చెరువులపై మొగ్గు చూపుతున్నారని తెలిపారు. సన్న, చిన్న కారు రైతులకు ఇది ఎంతో లాభాదాయకంగా ఉంటుందని చెబుతూ చేపల పెంపకంపై పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.



చేపల పెంపకం దారులను ఏ విధంగా ప్రోత్స హిస్తున్నారు?

పోషకాలు, ప్రోటీన్‌లు అధికంగా ఉండే చేపలు రోజు ఆహారంలో తీసుకోవచ్చు. రోజూ వినియోగదారులకు అందుబాటు లో ఉంచేందుకు ఫిష్ ఆంధ్ర పేరిట పల్నాడు జిల్లాలో 36 దుకాణాలకు అనేక రాయితీలు ఇచ్చి ప్రోత్సహించడం జరిగింది.

ఫిష్ ఆంధ్ర దుకాణాలు విజయవంతంగా నడుస్తున్నాయా?

ఫిష్ ఆంధ్ర పథకం ప్రవేశ పెట్టక ముందు నుండి చేపల వ్యాపారంపై అవగాహన ఉన్నవారికి కేటాయించిన 20కి పైగా దుకాణాలు విజయవంతంగా నడుస్తున్నాయి .కేవలం రాయితీలను అందిపుచ్చుకునేందుకు ప్రారంభించిన 16 దుకాణాలు నామ మాత్రంగా నడుస్తున్నాయి.

పల్నాడు జిల్లాలో ఎక్కడెక్కడ చెరువులు ఉన్నాయి?

పల్నాడు జిల్లాలో నరసరావుపేట, వినుకొండ, మాచర్ల నియోజకవర్గాలలోని పలు మండలాల పాటు క్రోసూరు, ముప్పాళ్ల లో చేపల చెరువులు అధికంగా ఉన్నాయి. గతంలో సరైన నీటి వసతి లేకపోవడంతో ఆసక్తి చూపని రైతులు, ప్రస్తుతం నీరు సమృద్ధిగా అందుబాటులో ఉండడంతో రైతులు చేపల పెంపకానికి ముందుకు వస్తున్నారు.

పల్నాడు జిల్లాలో మొత్తం సొసైటీ చెరువులు ఎన్ని ఉన్నాయి?

43 డిపార్టుమెంట్ చెరువులు 1500 హెక్టార్లు, 156 పంచాయతీ చెరువులు 780 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ఇదిలా ఉండగా 2300 ఎకరాలలో సొంత వ్యవసాయ భూములను చెరువులుగా చేసి చేపల పెంపకం చేపడుతున్నారు. 2300 ఎకరాలలో 70 శాతం మంది సొంత దారులే సాగు చేస్తున్నారు. డిపార్టుమెంట్ చెరువులను కలెక్టర్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వ హించి హెచ్చు పాటదారునికి లీజుకు ఇవ్వడం జరుగుతుంది. పంచాయతీ చెరువులు లీజు డి.ఎల్.పి.ఓ ఆధ్వర్యంలో సొసైటీ సభ్యుల సమక్షంలో పంచాయతీకి నిబంధనలను అనుసరించి చెల్లించాల్సి ఉంటుంది.

మత్స్య కారుల సహకార సంఘాలు, సభ్యుల సంఖ్య?

పల్నాడు జిల్లాలో చేపల చెరువులకు సంబంధించి 33 సహకార సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘానికి 100 మంది చొప్పున 3300 మంది కమిటీ సభ్యులు ఉన్నారు. పల్నాడు జిల్లా లో ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది మొత్తం డిమాండ్ ఉండడంతో పొలాల్లో చేపల చెరువులను నిర్మించు కొని ఆర్థికంగా లాభం పొందుతున్నారు.

చేపల పెంపకం దారులకు రాయితీలేమైనా ఉన్నాయా?

చేపల పెంపకందారులకు ప్రధాన మంత్రి మత్స్య యోజన పథకం కింద టివిఎస్ మోపెడ్లు, చేపపిల్లల రవాణాకు లారీలు, మినీ ట్యాంక్‌లు రాయితీపై సరఫరా చేస్తున్నాము. పల్నాడు జిల్లాలో నాగార్జున సాగర్, పులిచింతల జలాశయంలో మూడు అంగుళాల చేప పిల్లలను రాష్ట్రం వ్యాప్తంగా పోల్చి చూస్తే అధిక మొత్తంలో వదలడం జరిగింది. అవి ఆరు నెలల్లో కిలో నుంచి 1.5 కిలోల వరకు పెరుగుతాయి. తద్వారా మత్స్యకారులకు ఉపాధి అవకా శాలు పెంచేందుకు కృషి చేస్తున్నాము. చేపల పెంపకం చేపడు తున్న ఎస్.సి, ఎస్.టిలకు 60 శాతం, బిసిలకు 40 శాతం చొప్పున రాయితీలు కల్పిస్తున్నాం.

చేపల పెంపకానికి కోళ్ల వ్యర్థాలు వినియోగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి? మీరేమంటారు?

జిల్లాలో 300 ఎకరాలలో సాగులో ఉన్న ఫంగస్ ఫిష్, క్యాట్ ఫిష్‌లకు కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తున్నట్లు తెలిసి ఆరుగురు చేపల పెంపకందారులకు నోటీసులు ఇచ్చి హెచ్చరించడం జరి గింది. కోళ్ల వ్యర్థాలు చేపల చెరువులకు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. తౌడు, చీర్ నూకలు, ఫిష్ ఫీడ్ లతో మాత్రమే చేపల పెంపకం జరుగుతుంది. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా జిఓ నెం. 56 ప్రకారం కోళ్ల వ్యర్థాలు వినియోగించడం, రవాణా చేయ డం నేరం. రవాణా చేసిన వాహనాలను సీజ్ చేస్తాం.

నూతనంగా చేపల పెంపకం చేపట్టే వారికి మీరిచ్చే సలహా ?

నూతనంగా చెరువులు ఏర్పాటు చేసి చేపల పెంపకం చేపట్టే వారు ముందుగా మట్టి, నీటి పరీక్షలు చేయించుకోవాలి. దీనికి సంబంధించి వినుకొండలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ సెంటర్ ఉంది. రూ 50లు నామమాత్రపు రుసుము చెల్లించి పరీక్షలు నిర్వహించిన అనంతరం వచ్చిన ఫలితాలు ద్వారా చేపల పెంపకం చేపట్టవచ్చు. మత్స్య శాఖ అధికారుల సూచన మేరకు చేపల పెంప కాన్ని లాభసాటి చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నాం.

బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ 5న నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు

కార్పొరేట్లకు అనుకూలంగా, రైతులకు వ్యతిరేకంగా ఉన్న కేంద్ర బడ్జెట్‌ను నిరశిస్తూ ఈనెల 5వ తేదీన దేశవ్యాప్త పిలుపులో భాగంగా అన్ని గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించి, బడ్జెట్ ప్రతులు దగ్ధం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పిలుపుని చ్చారు. ఊహించినట్లే కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని, దివాళా తీస్తున్న వ్యవసాయరంగాన్ని కాపాడే విధంగా లేదని అన్నారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టంపై ఎటువంటి హామీ ఇవ్వకపోవడం రైతులను మోసగించడమేనని అన్నారు. ఎరువులు సబ్సిడీ మరింతగా పెంచాల్సి ఉందన్నారు. వ్యవసాయ ఇన్‌పుట్స్ ధరల తగ్గింపుపై ఎటువంటి ప్రతిపాదనలు లేవన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నామమాత్రపు కేటాయింపుల వలన ప్రయోజనం లేదని అన్నారు. కార్పొరేట్ కంపెనీల రుణాలు మాఫీ చేసిన మోడీ ప్రభుత్వం వ్యవసాయం నష్టాల్లో ఉన్న రైతు రుణమాఫీకి ఎటువంటి హామీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రకృతి వ్యవసాయవైపు కోటి మంది రైతులను మళ్ళిస్తామంటూ గొప్పలు చెప్పిన కేంద్రం బడ్జెట్‌లో మాత్రం రూ.616 కోట్లే కేటాయించి చేతులు దులుపుకుందన్నారు. కిస్మాన్ సమ్మాన్ ఊసెత్తలేదని, రైతు ఉత్పత్తి వ్యవస్థను ప్రోత్సహిస్తామంటూ చెబుతూ నిధులు కేటాయించలేదన్నారు వ్యవసాయ రంగానికి కేవలం రూ.1.71 లక్షల కోట్లే కేటాయించటం వల్ల పెద్దగా మేలు జరగదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో 10శాతం నిధులు వ్యవసాయ రంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్‌కు వ్యతిరేకంగా జరిగే నిరసనల్లో రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



ఎంపికైన జిల్లా జట్టుతో కుటుంబరావు, తదితరులు

హాకీ సీనియర్ ఉమెన్స్ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక హిందూ కాలేజి హైస్కూల్లో కెఎస్ఎస్ఆర్ కుటుంబరావు, ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు సమక్షంలో హాకీ గుంటూరు జిల్లా సీనియర్ ఉమెన్ టీమ్ ఎంపికలు జరిగాయి. ఈనెల 8వ తేదీ నుండి 10వ తేదీ వరకూ నెల్లూరులో జరిగే 15వ ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఉమెన్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఈ టీమ్ పాల్గొంటుందని హాకీ గుంటూరు కార్యదర్శి ఎం.అజయ్‌బాబు తెలియజేశారు. కార్యక్రమంలో పిఇటిలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం



వైజ్ఞానిక ప్రదర్శనలో నమూనాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, కన్నా మస్టారు..

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా ప్రోత్సహిచేందుకు, వారి ఉన్నతికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్ అన్నారు. ఆదివారం స్థానిక పాతగుంటూరు బొడ్డురాయి సెంటర్‌లోని కన్నా హైస్కూల్ 'ఆల్రౌండ్ ఎగ్జిబిషన్ 2025'లో రెండవరోజు ఎమ్మెల్యే నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నజీర్ అహ్మద్ మాట్లాడుతూ విద్యారంగంలో దశాబ్దాల అనుభవం ఉన్న డాక్టర్ కన్నా మాస్టర్ వెనుకబడ్డ ప్రాంత మైన పాతగుంటూరులో నాణ్యమైన విద్యా బోధన ద్వారా విద్యార్థులను ఆల్రౌండ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పి.పార్వతి, ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రసాద్‌బాబు విద్యార్థులకు బహు మతులు అందించిన కార్యక్రమంలో మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను, నైపుణ్యాలను, క్రియాశీలతను, స్వంతగా ఆలోచించే నైపుణ్యాలను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. కన్నా విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ కన్నా మాస్టర్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా విద్యార్థుల సమగ్రాభివద్దే శ్వాసగా ధ్యాసగా కృషి చేస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో ప్రధాన సలహాదారు వి.రాజేశ్వరిదేవి, ఎకడమిక్ డైరెక్టర్ కె.శ్రీదేవి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రత్నకుమారి పాల్గొన్నారు.

సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాలు నిర్మిస్తాం

ఎఐపిఎల్‌సిఎఫ్ జాతీయ అధ్యక్షులు గౌతమ్ ముఖర్జీ



నాటికల ప్రదర్శలు ఇస్తున్న కళాకారులు

ప్రజాశక్తి-గుంటూరు

సామ్రాజ్యవాద, ప్రపంచీకరణకు వ్యతిరేకంగా జాతీయ వాద సాహిత్య, సాంస్కృతిక, కళా ఉద్యమాలను నిర్మిస్తామని అఖిల భారత ప్రజా సాహిత్య, సాంస్కృతిక వేదిక జాతీయ అధ్యక్షులు గౌతం ముఖర్జీ అన్నారు. మూడు రోజులుగా గుంటూరులో నిర్వహించిన అఖిల భారత ప్రజా సాహిత్య, సాంస్కృతిక సభలు ఆదివారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు గౌతం ముఖర్జీ మాట్లాడుతూ పాలకపార్టీలు ప్రజలను కులం, మతం, ప్రాంతం, భాష ప్రాతిపదికన చీలుస్తోందన్నారు. అభివృద్ధి, నాగరికత పేరుతో అన్ని రకాలుగా విష సంస్కృతిని వ్యాప్తి చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా వివిధ రాష్ట్రాల నుండి రచయితలు, కళాకారులు చిత్ర ప్రదర్శనలు, పాటలు, లఘునాటికలు, రూపకాల ద్వారా పెద్ద ఎత్తున పాల్గొని ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు. చివరి రోజు మహిళలు, దళితులు, మైనార్టీలపై దాడులను ఆపాలని, పాలకవర్గాల గిరిజన వ్యతిరేక చర్యలను, సామ్రాజ్యవాద దేశాల దేశాలు ప్రోత్సహిస్తున్న యుద్ధాలను ఖండిస్తూ, ప్రజా సంస్కృతి ప్రజా అనుకూల ప్రత్యామ్నాయ జీవన విధానాన్ని ప్రోత్సహిస్తూ, సాహిత్యం కళలు, సామాజిక, సమానత్వం కోసం సాగే అన్ని ఉద్యమాలకు బాసటగా నిలవాలని, దేశంలోని అన్ని భాషల రక్షణను అభివృద్ధిని డిమాండ్ చేస్తూ సభలు తీర్మానం చేశాయి. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవిబాబు, ఉపాధ్యక్షులు దివి కుమార్, కోశాధికారి డాక్టర్ భట్టు రమణ ప్రసాద్, జన సాహితీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి అరుణ, శ్రీదేవి పాల్గొన్నారు.